# 1

# సర్వశక్తిగల దేవుడు ఉన్నాడా?

ఒక యిల్లు దాని పునాదులకంటే బలమైనదై యుండనేరదు. దేని మీద యిల్లంతా కూర్చుంటుందో ఆ పునాది మీద యింటి యొక్క వివిధ భాగాలు ఆధారపడతాయి.

ఇంటికి పునాది ఎట్టిదో, "సర్వశక్తిగల దేవుడు ఉన్నాడా?" అనే ప్రశ్న మానవ జీవితానికి అట్టిదైయుంది. దేవునియందలి మన విశ్వాసము లేక అవిశ్వాసము మన ఆలోచనకు పునాదిగా నిలిచి, జీవితాన్ని గూర్చి మనకున్న భావాలన్నిటిని వ్యాఖ్యానిస్తుంది లేక వాటికి రంగు దిద్దుతుంది.

గనుక, ఎవడైనా అడుగగలిగే మిక్కిలి సంపూర్ణమైన ప్రశ్న: "దేవుడు ఉన్నాడా?" అనేదే. ఆ ప్రశ్న అంత ప్రాముఖ్యమైనదనడానికి కారణమేమంటే – జీవితాన్ని గూర్చిన మిగిలిన ప్రశ్నలన్నిటికి వచ్చే జవాబు దీనిచేతనే ప్రభావితమౌతుంది.

ఉదాహరణకు, "లేదు, దేవుడు లేడు" అని ఒక మనిషి ఈ ప్రశ్నకు బదులిచ్చాడనుకుందాం. అప్పుడు, "నేను ఈ లోకంలో ఎలా జీవించాలి?" అనే ప్రశ్నకు యితడు జవాబు చెప్పేటప్పుడు, "నేను ఎలా కోరుకుంటే అలా బ్రతుకవచ్చు. నేను సృజింపబడిన జీవిని కాను గనుక, పైనున్న ఏ అధికారానికీ నేను జవాబుదారినై యుండను. నాకున్న ఒకే ఒక బాధ్యత నా సంతోషాన్ని బలపరచుకొనడం, మరియు సాటి మానవుల అభివృద్ధిని న్యాయమైన మార్గంలో బలపరచడం అంతే. వీటికి మించి, నా జీవితంలో నేను ఏమి చేస్తున్నానో అది నా యిష్టం. మరణాన్ని దాటి నేను తిరిగి జీవించబోయేది లేదు గనుక, ఈ జన్మలోనే నేను పొందగల జీవితాన్నంతటిని నేను సంపూర్ణంగా అనుభవించాలి" అని అంటాడు.

ఇప్పుడు, ఆ ప్రశ్నకు, "అవును, దేవుడున్నాడు" అని ఒక మనిషి బదులిచ్చాడనుకో, "నేను ఈ లోకంలో ఎలా జీవించాలి?" అనే ప్రశ్నకు సంపూర్ణంగా వేరైన

జవాబును అతడిస్తాడు. ఈ ప్రశ్నకు జవాబుగా, "నేను సర్వశక్తునివలన సృజింపబడ్డాను, నా ఉనికిపట్ల ఆయనకు స్పష్టమైన ఉద్దేశముంది, నేను ఆయన సంకల్పాన్ని కనుక్కోవాలి. ఆయన చిత్తమేమో దానిని కనుగొనుటవలనను, దాని ప్రకారం జీవించుటవలననే శాంతిని, సృష్టికర్త నా కొరకు ఉద్దేశించిన ఏర్పాటును నేను కనుగొనగలను. ఈ లోకంలో నేను ఎలా జీవించానో దాని గూర్చి ఒకనాడు ఆయన నన్ను అడగడానికి పిలుస్తాడు" అని అంటాడు.

"సర్వశక్తిగల దేవుడు ఉన్నాడా?" అనే ప్రశ్నను బహు జాగ్రత్తగా ఆలోచన చేద్దాం. దేవుడు ఉన్నాడని నమ్మడానికి బలవత్తరమైన ఆధారములున్నాయా? ఏదియెలాగున్నా, దేవుని ఉనికిని గూర్చిన వాదనతో బైబిలు ప్రారంభం కాలేదు. దేవుడున్నాడనే వాస్తవాన్ని స్థిరపర్చుతూ అది ప్రారంభమౌతుంది: "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది. 1:1). ఏదియెలాగున్నా దేవుని ఉనికికి తార్కికమైన రుజువులు బైబిల్లో చెదురుమదురుగా కన్పిస్తాయి: కొన్ని ప్రత్యక్షంగాను, మరికొన్ని పరోక్షంగాను యివ్వబడ్డాయి; కొన్ని బహిర్గతంగా చెప్పబడ్డాయి, మరికొన్ని గుప్తం చేయబడ్డాయి. రెండు సంగతులను ఆలోచించడంవలన వాటిలో కొన్నింటిని సంక్షిప్తంగా చూద్దాం. ఈ రెండు కారణాలను లోతుగా నీవు ఆలోచించినట్లయితే, దేవుడు నిజంగా ఉన్నాడని ధైర్యంగా చెప్పడానికి అవి నిన్ను నడిపిస్తాయి.

## లోకము యొక్క సాక్ష్యము

దేవుడు నిజంగా ఉన్నాడని మనలను నమ్మించే మొదటి సాక్ష్యము లేక రుజువు, మనచుట్టు మనపైన ఉన్న లోకమే. భూమియు, విశ్వమును సమానంగా దేవుని ఉనికిని చాటుతున్నాయి.

మనం నిలిచియున్న గ్రహాన్ని భూమియని పిలుస్తాం. ఇది సూర్య కుటుంబంలో భాగమైయుండి, సూర్యుని చుట్టు తిరుగుతుంది. ఈ సూర్య కుటుంబానికి ప్రశ్నింపబడని క్రమమును, పన్నుగడయు (డిజైన్) ఉన్నాయి. గ్రహాలన్నీ తమ తమ పరిధుల్లో తిరుగుతూ ఉంటాయి. ఒకదాని మీద మరొకటి ఎన్నడును పడవు. సరియైన వేగంతోను, సరియైన దూరంలోను సూర్యుని చుట్టు అవి తిరుగుతాయి. సూర్యునితో భూమికి ఉన్న సంబంధాన్ని బట్టి, రాత్రులు, పగళ్లు, రుతువులు ఏర్పడతాయి. ఎల్లవేళలా సూర్యునినుండి భూమి తగినంత దూరంలోనే ఉంటుంది. సూర్యునినుండి మనం ఏ మాత్రము దూరమయ్యేమా, మంచు గడ్డయైపోతాము; మనం యింకేమైన దగ్గరకు వచ్చామా, మాడిపోతాం.

మనం నివసించే భూమండలమే కాక ఆకాశంలో అసంఖ్యాకమైన సౌర కుటుంబాలున్నట్టు శాస్త్రజ్ఞులు పేర్కొంటారు. విశ్వం యొక్క పొడవు వెడల్పులెంతో మనకు తెలియదు. దాని చివరి కొనకు టెలిస్కోపు మనలను తీసికొని వెళ్లలేదు; దాని వెడల్పు ఎంతో మన మనస్సులు గ్రహించలేవు. విశ్వాన్ని గూర్చి మనకు తెలియనిది ఎంతో ఉన్నా, దానిలో ఒక విషయాన్ని గూర్చి మాత్రం మనకు నిశ్చయంగా తెలుసు – అది క్రమమును, పన్నుగడయు (డిజైనె) కలిగియున్నది. అది ఎగుడు దిగుడుగాగాని, చిందర వందరయైనదిగా గాని లేదు; అది ఏకము చేయబడినదై క్రమముగా నిలుప బడినదై ఉందనేది వాస్తవమే.

దాని విషయమై రెండింటిలో ఏదోయొక నిర్ణయానికి వచ్చేలా విశ్వం యొక్క ఉనికి ధైర్యంగా అడుగుతుంది: అది సృజింపబడినదైనా అయ్యుండాలి లేదా కేవలం ఆకస్మికంగా సంభవించినదైనా అయ్యుండాలి. విశ్వం తనంత అదే కలిగిందని ఒకడు వాదించగోరితే, అది శూన్యంలోనుండి వచ్చిందనియైనా రుజువు చేయాలి, లేదా యింతకు మునుపు ఉన్న పదార్థాలలో జరిగిన ప్రేలుడు (కాస్మిక్ ఎక్స్‌ప్లోషన్) ఫలితంగా వచ్చిందనియైనా వాదించాలి. అసలు ప్రధానమైన తొలి రెండు తీర్మానాలలో విశ్వం సృష్టింపబడింది అనేది మాత్రమే న్యాయ సమ్మతమైనది. శూన్యంలోనుండి విశ్వం వచ్చిందని యథార్థంగా లేక న్యాయ బుద్ధితో ఎలా నమ్మగలం? కేవలం పదార్థం మాత్రమే శాశ్వతంగా ఉందని, విశ్వమనేది కాస్మిక్ ఎక్స్‌ప్లోషన్‌వలన ఏర్పడిందని తార్కిక వివేచనతో మనం ఎలా నమ్మగలం?

చేతిలో పుస్తకం పట్టుకొని ఒక మనిషి నా వద్దకు వచ్చాడనుకుందాం. ఆ పుస్తకం నాకిచ్చి దానివైపు చూడుమని అతడు నన్నడిగాడు. ఆ పుస్తకం యొక్క ముందు కవర్ మీద "క్రుడెన్స్ కంప్లీట్ కంకార్డెన్స్" అని ఉంది. ప్రచురణ కర్తలయొక్క స్థానంలో "జొండర్‌వాన్" అని ముద్రించబడింది. నేను పేజీలను తిరగవేస్తుండగా, ఇంగ్లీషు బైబిల్లో ఉన్న వివిధములైన పేర్లు, స్థలాలు, పద ప్రయోగాలు అక్షర క్రమంలో కూర్చబడి, బైబిల్లో అవి ఎక్కడ కన్పిస్తాయో ఆ రిఫరెన్సులు వాటి క్రింద వేయబడియున్నాయి. ఆ పుస్తకం యొక్క అట్టమీద 2,00,000 (రెండు లక్షల) రిఫరెన్సులకు పైగా అందులో పేర్కొనబడినట్టు చెప్పబడింది. "నేను పబ్లిషింగ్ కంపెనీని కాంటాక్ట్ చేసి, ఇలాటి ఒక కాపీని పొందగలనేమో విచారిస్తానని" ఆ మనిషితో నేను అన్నానే అనుకో.

అందుకు "ఈ పుస్తకం యొక్క కాపీని నీవు కొనలేవు. జొండర్‌వాన్‌చే అది ప్రచురింపబడలేదు సరిగదా, అలెగ్జాండర్ క్రుడెన్స్ కూడా దాన్ని ఏరి ఒక దానితో నొకటి కూర్చలేదు. ఈ పుస్తకం దానంతట అదే కలిగింది. దాని పరిపూర్ణమైన స్థితిలో

దాన్ని కనుగొన్నాను. శూన్యంలోనుండి అది ఉనికిలోనికి వచ్చింది" అని ఆ మనిషి అన్నాడు. "ఈ పేర్లు, స్థలాలు, ఇంగ్లీషు బైబిలు యొక్క పద ప్రయోగాలు ఒక దానితో నొకటి ఎవనిచేతను కూర్చబడలేదంటావా? ఈ 2,00,000 (రెండు లక్షలకు) పైబడిన రిఫరెన్సులు శూన్యంలోనుండి ఉనికిలోనికి వచ్చాయని నీవు నాకు చెప్పుతున్నావా? ఈ పుస్తకానికి టైప్ సెట్ చేసి, దాన్ని ప్రింటు చేసి, బైయిన్‌డింగ్ చేయలేదంటావా?" అని నేను తిరిగి అతన్ని అడిగాను.

"అవును, అదే నేను చెప్పుతున్నది" అని అతడు బదులిచ్చాడు. అందుకు నేను "నీవు అపార్థం చేసికొన్నావు. మనిషిగా నేను నిన్ను గౌరవిస్తాను, కాని ఈ పుస్తకం యొక్క మూలాన్ని గూర్చిన నీ తీర్మానాన్ని నా తార్కిక జ్ఞానం అంగీకరించదు. నేను తప్పుగా రుజువు చేయబడతానేమో అనే ఏ భయము లేకుండ, ఈ పుస్తకం దానంతట అదే పుట్టుకు రాలేదు" అని నేను అంటాను. ఆ మనిషికి యిచ్చిన నా జవాబు విషయంలో నేను స్థిర నమ్మిక కలిగియున్నాను, ఎందుకంటే, తార్కికంగా ఆలోచింపగల నా సామర్థ్యం ఆ పుస్తకం యొక్క మూలాన్ని గూర్చి మరి యిక ఏ తీర్మానం చేయడానికి అంగీకరించదు.

మరొక మనిషి వచ్చి ఒక రేడియోను నా చేతికి అప్పగించాడనుకుందాం. ఆ మనిషి నాతో యిలా అన్నాడు: "నీవు రేడియోవైపు చూడాలని కోరుతున్నా. దీని అడుగున ఒక ఎలక్ట్రికల్ తీగెను లోపలికి చొప్పించాలి, ఎలక్ట్రికల్ (విద్యుత్) శక్తితో ఈ రేడియోను 'ఆన్' చేసికొని నీవు వినవచ్చు. ఈ రేడియో లోపలి అడుగు భాగాన ఒకలాంటి బేటరీ ఉంది. విద్యుత్ ప్లగ్‌తో దీన్ని కలిపినట్లయితే, ఆ బేటరీలో విద్యుత్ శక్తి భవిష్యత్ ఉపయోగంకొరకు నిలువ చేయబడుతుంది. ఈ విధంగా, విద్యుత్ కనెక్షన్ లేకుండగను దూరంగా వెళ్లినప్పుడు, విద్యుత్ శక్తితో సంబంధం అవసరత లేకుండగను, నీవు దాన్ని వాడుకోవచ్చు. దీన్ని యింటి వద్దనేమి, ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా వాడుకోవచ్చు." అందుకు నేను, "ఇది చాలా ప్రయోజనకరమైన వస్తువు నేను కొంత ప్రయాణం కూడా చేస్తూ ఉంటాను, యిలాటి రేడియో నా కెంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇటువంటి రేడియో నేను కొనాలనుకొంటున్నాను" అని అన్నాను.

"ఓ, లేదు. ఈ రేడియో కొనగలిగింది కాదు. అది సృజింపబడింది (తయారు చేయబడింది) కాదు. అది కేవలం సంభవించింది. ఇక్కడికి సమీపంలోనే ప్లాస్టిక్స్, మెటల్స్, కొయ్య, వగైరా, అన్ని రకాలైన సామాగ్రిలుండే ఒక ఫ్యాక్టరీ ఉంది. ఆ బిల్డింగులో కొద్ది వారాల క్రిందట గొప్ప శబ్దంతో ప్రేలుడు జరిగింది. వస్తు సామాగ్రియంతా గాలిలోనికి త్రోయబడింది. అవి యింకా గాలిలోనే ఉండగా, కొన్ని పదార్థాలు కలిసి వచ్చాయి, ఏదో యొక విధంగా ఒకదానితో ఒకటి చొప్పించుకున్నాయి, అందులోనుండి

వస్తు రూపంగా యిది నేలమీదపడింది. పాడైపోయిన ఆ బిల్డింగ్ యొక్క కూలియున్న వస్తువుల కుప్ప మరియు రాళ్ల గుట్టల్లో మేము ఈ రేడియోను కనుగొన్నాం. ఇది డిజైన్ చేసిందో లేక తయారు చేసిందో కాదు; యిది ఆ ప్రేలుడు ఫలితంగా వచ్చింది" అని అన్నాడు. అందుకు నేను, "ఈ రేడియో డిజైన్ చేయబడలేదని, జాగ్రత్తగా ఒకదాని మీద ఒకటి అమర్చబడలేదని, నన్ను నమ్మమని నీవంటున్నావా? ఈ రేడియో తెలివినిబట్టి వచ్చింది కాదని, కేవలం విపత్కరమైన ఆకస్మిక సంభవానికి ప్రతిఫలంగా వచ్చిందని నీవు స్థాపించుతున్నావా?" అని నేను అడిగాను. ఆ రేడియో అలాటి గొప్ప శబ్దంతో జరిగిన ప్రేలుడులోనుండే వచ్చిందని అతడు నిగ్గదీస్తుంటే, "ఆ రేడియో విషయంలో నీవు అపార్థం చేసికొనియుంటావు. ఆలోచన చేయగల ఏ వ్యక్తికూడా అలాటి తీర్మానానికి రాలేదు. ఈ విధంగా రేడియో ఉనికిలోనికి వచ్చిందనే భావన నేను కలిగియుండలేన"ని అంటాను. ఆ మనిషికి నేనిచ్చే జవాబు విషయంలో సంపూర్ణమైన నిశ్చయతతో ఉంటాను. తార్కికంగా యోచింపగల నా సామర్థ్యం మరి ఏ యితరమైన తీర్మానానికి సమ్మతించదు.

పుస్తకం విషయంలోనేమి, రేడియో విషయంలోనేమి సంపూర్ణ నిశ్చయతతో మనం వచ్చి చేరుకున్న తీర్మానంకంటే ఎంతో మిన్నగా విశ్వాన్ని గూర్చిన తీర్మానం జరగాలి. విజ్ఞాన శాస్త్రంలో ఉన్న ఎంతటి అలంకారమైనా, శాస్త్ర పారిభాషిక పదాలైన, శూన్యంలోనుండి విశ్వం వచ్చిందనిగాని, లేదా గంభీరమైన శబ్దంతో జరిగిన ప్రేలుడు వలన అది కలిగిందనిగాని నమ్మించలేవు. పుస్తకంకంటెను, రేడియోకంటెను ఊహించ లేనంత ఎక్కువగా మహా విశ్వం పన్నుగడ (డిజైన్) చేయబడింది, చిత్రించబడింది. పుస్తకం ఊరకే ఉత్పన్నమైనదనిగాని, లేదా రేడియో గొప్ప శబ్దంతో ఫ్యాక్టరీలో జరిగిన ప్రేలుడువలన రూపొందిందనిగాని మనం నమ్మలేనప్పుడు, మహా విశ్వం శూన్యంలో నుండి వచ్చిందని కాని, మతిలేని పదార్థం ప్రేలినందున అది ఏర్పడిందనిగాని ఎలా నమ్మగలం? ఏ కొంచెం వివరంగానైనా మహా విశ్వాన్ని గూర్చి చదివిన వారెవరైనా, అది సంకీర్ణమైన పద్ధతితోనూ, సూక్ష్మతతోనూ కూడినదని గుర్తించి ఆశ్చర్యపోతారు.

తార్కిక జ్ఞానంతో మనం ఏ తీర్మానానికైతే వచ్చామో, దాన్ని బైబిలు స్థాపిస్తోంది. కీర్తన. 19:1, "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి, అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది" అని అంటుంది. మరో విధంగా చెప్పాలంటే, వెన్నెల రాత్రిలో నేలమీద కూర్చుండి మనం ఆకాశమువైపు తేరి చూచినట్లయితే, అద్భుతమైన ఆరాధనా కార్యక్రమంలో కూర్చుండియున్నట్టే ఉంటుంది. అసంఖ్యాకములగు నక్షత్రాలతో కూడిన రాత్రి ఆకాశము ప్రీచర్‌గాను, మనమే స్థానిక సంఘంగా ఉంటాం. ఆడిటోరియం మనం కూర్చుండే పచ్చికబయలే. ఆ ప్రీచర్ మౌనంగా కాని బహు అనర్గళంగా,

"నక్షత్రాలు ఊరకే సంభవించినవైకావని, అవి సృజింపబడినవేనని" ప్రకటిస్తాడు. నక్షత్రాలతో కూడిన ఆకాశం దేవుని మహిమను వివరిస్తుంది. మన ఆ ఆరాధనా కార్యక్రమాన్ని వదలి వెళ్లేటప్పుడు, "ఈ ప్రీచర్‌ద్వారా నేను విన్న సందేశము రైటై యుండాలి. నా తార్కిక జ్ఞానము మరి యిక ఏ సందేశాన్ని అంగీకరింపనొల్లదు" అని మనమంటాం.

క్రొత్త నిబంధన లేఖకులలో ఒకడైన పౌలు యిలా వ్రాశాడు, "ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు" (రోమా 1:20). విశ్వంలో కన్పించే, సృష్టించే వస్తువులు, కంటికి కన్పించని అదృశ్యమైన దేవుని హస్తాన్ని రుజువు చేస్తున్నాయి. ఆయన సర్వశక్తిగల అధికారాన్ని, ఆయన మానవాతీతమైన స్వభావాన్ని అవి తెలుపుతున్నాయి. దేవుని ఉనికి సాధారణమైన ప్రత్యక్షత ద్వారా–మన చుట్టునున్న లోకం, మనకు పైగానున్న లోకం ద్వారా మనం నేర్చుకుంటాం. పౌలు కూడా యిలాగే అన్నాడు, "అయినను ఆయన ఆకాశమునుండి మీకు వర్షమును, ఫలవంతములైన రుతువులను దయచేయుచు, ఆహారము ననుగ్రహించుచు, ఉల్లాసముతో మీ హృదయములను నింపుచు, మేలు చేయటచేత తన్ను గూర్చి సాక్ష్యములేకుండ చేయలేదు" (అపొ. 14:17). మన గ్రహము యొక్క లోకము, మహా విశ్వముయొక్క లోకము సర్వశక్తిగల దేవుని ఉనికికి సాక్ష్యమిస్తున్నాయి.

దాదాపుగా మన అందరి అభిమానం పొందిన పిల్లల కథలో రాబిన్‌సన్ క్రూజో ఓడ నిర్మానుష్యంగా ఉన్న ద్వీపం దగ్గర బ్రద్దలౌతుంది. ఆ బ్రద్దలైన ఓడనుండి ఒడ్డునకు కొట్టుకొనివచ్చిన తోడనే, తనతోపాటు బ్రతికినవారు యింకెవరైనా ఉన్నారేమోనంటూ అతడు చుట్టూ చూచాడు. ఎవరూ కన్పించలేదు. బ్రద్దలైన ఓడలో తాను మాత్రమే బ్రతికాడు. ఇతర మానవుల కొరకు అతడు ఆ ద్వీపమంతా గాలించాడు, అయినా ఎవరూ కన్పించలేదు. ఆ ద్వీపమంతటిలో తాను ఒంటరిగా ఉన్నట్టు తీర్మానానికి వచ్చాడు. చెట్ల కొమ్మలతోను, మొద్దులతోను ఒక విధమైన యింటిని అతడు తనకొరకు చేసికొన్నాడు. ఆ ద్వీపంలో లభించే అడవి పండ్లతో అతడు జీవించాడు. ఆహారం కోసం వస్త్రాల కోసం అడవి జంతువుల్ని వలపన్ని చంపాడు. ఒక రోజున సముద్ర తీరాన అతడు నడిచిపోతుండగా, మెత్తని యిసుక మీద మరొక మనిషి యొక్క అడుగుజాడలను చూచాడు. మూడింటిలో ఏదో యొక తీర్మానం రైటౌతుందని వెంటనే అతనికి తెలిసింది: ఎవడో ఒకడు ఈ అడుగుజాడలను విడిచి వెళ్లిపోయి ఉండవచ్చు. లేదా ఈ అడుగుజాడలను వేసినవాడు ఒక వేళ చనిపోయి ఉండవచ్చు. అలాగైతే ఆ

ద్వీపంలో క్రూజో ఆ చచ్చినవాడిని కనుగొంటాడు. లేదా అలాటి అడుగుజాడలను విడిచినవాడు ఆ ద్వీపంలో యింకా సజీవంగా ఉండవచ్చు. తాను కాకుండ యింకొకడు ఆ ద్వీపంలో ఉన్నాడన్న సత్యం తన హృదయాన్ని సంతోషపరచింది. అడుగుజాడలు దాన్ని రుజువు చేశాయి. దాని విషయమై అతడు సంపూర్ణ నిశ్చయతగలవాడై ఉన్నాడు. ఈ ద్వీపమంతటిని గాలించి వెదకి, కడకు, ఒకానొక శుక్రవారం రోజున, ఆ అడుగుజాడలను వేసిన స్థానికుని అతడు కనుగొన్నాడు. తాను అతన్ని కనుగొన్న రోజుననుసరించి అతనికి శుక్రవారం అని పేరు పెట్టాడు.

ఈ కథ పుస్తకంలోని రాబిన్‌సన్ క్రూజో అనే వ్యక్తిలా మనం అనేక విషయాలలో ఉన్నాం. మన యెదుట భూమి నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడు అనే వాటి అడుగుజాడలు ఉన్నాయి. ఈ ముద్రలు సర్వశక్తిగల వ్యక్తిచే చేయబడినవే. ఆ అడుగుజాడలను చూచిన క్రూజో అవి ఎక్కడనుండిరాలేదు అనే తీర్మానానికి వచ్చియున్నట్టయితే, బుద్ధిహీనుడై యుండేవాడే. అలాగే, తార్కిక జ్ఞానాన్ని అలక్ష్యంచేసి, భూమి మరియు మహా విశ్వమంతా కేవలం సంభవించిందని, లేక శూన్యంలోనుండి వచ్చిందని తీర్మానించనట్లయితే, మనం అజ్ఞానులమై ఉంటాం, కదా!

మనచుట్టునున్న లోకము, మనకు పైనున్న లోకం ఒకే ఒక తీర్మానాన్ని సూచిస్తుంది: సర్వశక్తిగల దేవుడు ఈ భౌతికమైన భూమి వెనుకను, భౌతికమైన ఈ మహా విశ్వం వెనుకను ఉన్నాడు. ఒక పుస్తకం శూన్యంలోనుండి రాలేదనిన్నీ, ఒక విద్యుత్ రేడియో ఒక పేలుడుద్వారా రాలేదనిన్నీ మనం ఎంత రూఢిగా నమ్ముతున్నామో, అలాగే దీని విషయంలోను మనం రూఢిగా నమ్మవచ్చు.

## మానవుని యొక్క సాక్ష్యము

రెండవది, దేవుడు ఉన్నాడని మనం రూఢిగా నమ్మవచ్చు ఎందుకంటే మానవుని ఉనికి ద్వారా మనకు ఈ రుజువు లభిస్తుంది. మానవుని యొక్క ఉనికి దేవుని ఉనికిని ప్రకటిస్తుంది.

భౌతికమైన విశ్వంకంటెను నరుడు చాల గొప్ప ఆశ్చర్యకరమైనవాడైయున్నాడు. అతని గ్రహణ శక్తి లేక అతని మేధా శక్తిని గూర్చి ఆలోచించు. అతడు తార్కికంగా ఆలోచించగలడు, నమ్మగలడు, ప్రేమించగలడు, గొప్పగా ఊహించగలడు, ఉపాయం పన్నగలడు, రూపించగలడు, నాలుగు లేక అంతకంటే ఎక్కువైన భాషలు అనర్గళంగా మాట్లాడగల జనులున్నారు. మనం నేడు నిర్మించగల ఎంతటి శ్రేష్ఠమైన కంప్యూటర్

కంటెను మానవ మెదడులో ఉన్న ఒక్క జీవకణం ఎక్కువ జటిలమైయున్నదని విజ్ఞాన శాస్త్రవేత్తలు చెప్పుతున్నారు.

మానవుని ఆత్మసంబంధమైన స్వభావాన్ని గూర్చి ఆలోచించు. ఆదినుండి మానవుడు ఎల్లప్పుడును ఆరాధించువాడైయున్నాడు. ఎక్కువమంది ఆది మానవులు ఏదోయొక అతీతమైన శక్తిని ఆరాధించడానికి చూచేవారు. తన అంతరంగంలో నరునికి "వలెను" (లేక [చేయ] వలయును) అనే భావన ఉంది. అతనికి నైతిక స్పృహ తనలోనే ఉంది. కొన్ని సార్లు ఈ స్పృహ తగినంత పరిశుద్ధంకాని మాట వాస్తవమే, కాని అది ఎల్లవేళల అతనిలోనే దాగియుంటుంది.

నరుని భౌతికమైన దేహాన్ని గూర్చి ఆలోచించు. మానవ దేహంలో ఏ భాగాన్ని గూర్చియైన జీవితాంతం చదువుతునే ఉండు, దాని విషయంలో జరిగే పరిశోధనను అంతమొందించలేవు.

ప్రాణాన్ని గురించే ఆలోచించు. మనం దాన్ని సృజించలేము, అది చనిపోతే తిరిగి బ్రతికించలేము. సంపూర్ణంగా దాన్ని మనం వివరించలేం. పరిపూర్ణంగా దాన్ని మనం అదుపులో ఉంచుకోలేము. మనిషి అనే ఆశ్చర్యమే వాని సృష్టికర్తయొక్క ఉనికిని చాటుతోంది.

ప్రఖ్యాతిగాంచిన యొక ప్రొఫెసరు క్లాసు రూములో ప్రాణముయొక్క ప్రారంభాన్ని గూర్చి ఉపన్యసిస్తుంటే మనం వింటున్నామనుకుందాం. విజ్ఞాన శాస్త్ర సంబంధమైన పద ప్రయోగాలతో, తాను ఉపయోగించే వివరణలతో, మొత్తానికి అతడేమన్నాడంటే, "ఆదిలో ఏదో యొక రకమైన ఏకకణ జీవి ఉంది, అది విస్తరించి, పెదిగి, అభివృద్ధి చెందింది. ఒక విధమైన సముద్రపు జీవిగా తయారయ్యింది. అది విస్తరించి, పెరిగి, వృద్ధిపొందింది. చివరిగా కోట్లకొలది సంవత్సరాలు గడిచేకొలది, మానవులు అనబడే జీవులుగా పరిణామం చెందింది."

ఆ ప్రొఫెసరు యొక్క ఉపన్యాసాన్ని వింటుండగా, తన సిద్ధాంతం పరిష్కరించలేని మూడు సమస్యలను మేము ఎదుర్కోవలసివచ్చింది. ఈ సమస్యలు అంత ప్రాముఖ్యమైనవి కావని, అవి ప్రస్తావనకే యోగ్యమైనవికావని, అతడు వాటిని దాటి వెళ్లిపోయాడు. అయితే ఆ సమస్యలను తీర్చడం అతనికి అసాధ్యం, మరియు అవి అతని సిద్ధాంతాన్ని న్యాయసమ్మతం కానట్టు చేస్తాయి. మొదటి సమస్య ప్రాణం యొక్క ఆరంభాన్ని వివరించడం. ప్రాణంలేని దానినుండి ప్రాణం వచ్చిందని తన సిద్ధాంతం ఊహిస్తుంది. ఏమిలేని దానినుండి పుస్తకం వచ్చిందని, గొప్ప ప్రేలుడు ఫలితంగా రేడియో వచ్చిందని నమ్మడం అసాధ్యంగా ఉన్నట్టు ఏ వ్యక్తియైనా కనుగొంటాడు గదా? అలాటప్పుడు,

ప్రాణమనేది పుస్తకంకంటెను, రేడియోకంటెను ఎంతో కాంప్లెక్స్ అయ్యిందే. ఎలాగంటే మనిషి ఒక పుస్తకాన్ని లేదా రేడియోను సృజించగలడు, కాని అతడు ప్రాణాన్ని సృష్టించలేడు. అయినా, ప్రాణంలేని దానిలోనుండి ప్రాణం వచ్చిందని ఆ ప్రొఫెసర్ మనలను నమ్మమంటాడు. (అజ్ఞానంగా అనాలోచనగా అనేకులు నమ్ముతారు.)

రెండవ సమస్య ప్రకృతి సూత్రాల ఉనికిని వివరించడం. ప్రకృతి సూత్రాలు శూన్యంలోనుండి వచ్చాయని ఆ ప్రొఫెసరు యొక్క సిద్ధాంతం ఊహిస్తోంది. మన లోకం ప్రకృతి సూత్రాలచే పాలింపబడుతుంది. నీ దేహంలోనికి ఏదో యొక రూపంలో ఆహారాన్ని పంపకపోతే, లేదా నీవు భోజనం చేయకపోతే, చనిపోవడం సహజం. ఈ సూత్రాన్ని తప్పించుకోలేవు, అలక్ష్యం చేయలేవు, ఏ నరుడును దీనినుండి మినహా యింపబడడు. నీవు నిదురించకపోయినట్లయితే, నీ దేహం అలసినదై కుప్పకూలి పోతుంది. ఈ ప్రకృతి సూత్రాన్ని నీవు నిలిపివేయలేవు. మరణమనే పకృతి సిద్ధమైన మరో చట్టాన్ని నీవు జయించలేవు. మానవ మరణం యొక్క విధి 100 పాళ్లు వాస్తవం. దీనికి ఏ ఆక్షేపణో లేక మినహాయింపో లేదు. ప్రకృతిలోని ఈ చట్టాలు కేవలం సంభవించినవేనని ఆ ప్రొఫెసరు యొక్క సిద్ధాంతం సూచించుతోంది.

మూడవ సమస్య కుటుంబము యొక్క ఉనికిని వివరించడం. మానవజాతి కుటుంబాలతో నిర్మితమైయుంది. దాఖలు చేయబడిన మానవ చరిత్రలో కుటుంబాల ఉనికిలేని కాలాన్ని మనం కనుగొనలేం. పురుషుడు పరిపూర్ణమైన రూపానికి పరిమాణం చెందినప్పటికే, స్త్రీ కూడా పరిపక్వానికి పరిణామం చెందినట్టు ఆ ప్రొఫెసరులయొక్క సిద్ధాంతం నమ్ముతుంది. వారిరువురి సహవాసం అనుకోకుండానే సంభవించి ఆనంద దాయకమైందని, ఆ విధంగా స్త్రీ పురుషుల మధ్య ఉన్న కుటుంబ సంబంధాలు రికార్డు చేయబడిన చరిత్రయంతటిలో కొనసాగాయని అతని సిద్ధాంతమంటుంది. పురుషుడు స్త్రీకి భిన్నమైనవాడు. స్త్రీ పురుషునికి భిన్నమైనది; అయినా, వారు ఒకరికొకరు సరిపడేలా ఒకటైయుంటారు. అయినా, వారిద్దరు ఒకేసారి పరిపక్వానికి అందివచ్చి, అదే సమయంలో వారు కుటుంబంగా ప్రతిఫలించారని ఆ ప్రొఫెసరు అంటాడు. మరో విధంగా చెప్పాలంటే, కుటుంబమనేది ఏమిలేని స్థితిలోనుండి వచ్చిందని అతడు వాదిస్తాడు – అది కేవలం ఆకస్మికమైన సంభవం మాత్రమేనని అతని భావన.

ప్రాణము ప్రాణంకాని దానినుండి వచ్చిందనిగాని, శూన్యంలోనుండి ప్రకృతి సూత్రాలు లేక చట్టాలు వచ్చాయనిగాని, లేక మానవ కుటుంబం శూన్యంలోనుండి ఉద్భవించిందనిగాని భావించడానికి మన మనస్సులు అంగీకరించవు. సర్వశక్తిగల వ్యక్తి నరుని సృజించి, ప్రత్యేకమైన కారణంకొరకు ఆయన అతనిని భూమిమీద

నిలిపాడనేది మానవ ఉనికికి ఒకేఒక తార్కికమైన మార్గమైయుంది.

తార్కిక వివేచనవలన మనము ఏ నిర్ణయానికి వచ్చిచేరుకున్నామో, దానినే బైబిలు స్పష్టంగా ప్రకటించింది. బైబిలు యొక్క మొదటి అధ్యాయంలో, "మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము" అని దేవుడన్నాడు (ఆది. 1:26). మానవ జీవము దేవుని జీవంలోనుండి వచ్చిందని బైబిలు అంటుంది. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా–మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను" (ఆది. 1:27, 28). దేవుడు నరునికి, ఆత్మసంబంధమైన స్వభావాన్ని, తన సొంత పోలికను అనుగ్రహించాడు. స్త్రీ పురుషులతో నిర్మింపబడిన కుటుంబాన్ని సృజించాడు. భూసంబంధమైన జీవితాన్ని ఏలుబడి చేయడానికి దేవుడు ప్రకృతి సూత్రాలను నిర్మించాడు.

మానవ ప్రాణి దైవికమైన ఆలోచనను బట్టి సర్వశక్తుని చేతిలో నిర్మింపబడినట్టు అంగీకరించండని తార్కిక జ్ఞానము ధైర్యముగా మనలను అడుగుతుంది. అందునుబట్టి నిస్సందేహంగా, "నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి. నా తల్లి గర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి. అందునుబట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. నీ కార్యములు ఆశ్చర్యకరములు ఆ సంగతి నాకు బాగుగా తెలిసియున్న"దని మనం చెప్పవచ్చు (కీర్తన. 139:13, 14).

ఒక మిషినెరీ ఒకప్పుడు యిలా అన్నాడు, "ప్రపంచంలోని పలు దేశాల్లో నేను ఉన్నాను, మరియు ప్రతి దేశంలోను నేను ఒకే విధమైన అనుభవం పొందాను. ఉదాహరణకు, రెండును రెండుతో కలిపితే నాల్గవుతుందని చిన్న పిల్లలకు నేర్పినప్పుడు, వారు ఎల్లప్పుడు అదే విధంగా బదులిచ్చారు. వారు దాన్ని గూర్చి ఆలోచించి, అది రైటనే నిర్ణయానికి వచ్చారు. వారి మనస్సుల్లో ఉన్న ఏదో యొకటి ఆ భావానికి సమీపంగా వచ్చి, అది సత్యమని అంగీకరిస్తుంది. అలాగే, దేవుడు భూమిని, ఈ విశ్వాన్ని, మరియు నరుని సృజించాడని ఈ వివిధములైన దేశ జనులకు బోధించి నప్పుడు, వారు దాన్ని గూర్చి ఆలోచిస్తారు, ఈ భావన రైటైయుండాలనే తీర్మానానికి వస్తారు. వారి మనస్సుల్లో ఉన్న ఏదో యొకటి ఆ బోధను సమీపించి, దాన్ని సత్యంగా అంగీకరిస్తుంది. ఈలాంటి ప్రతిక్రియ నేను వెళ్లిన ప్రతి దేశములోను, ప్రతి జనము

మధ్యను పొందాను."

మానవుని యొక్క ఉనికిని గూర్చి నీవు యోచించినట్లయితే, అంటే అతని ప్రాణము, అతని మేధా శక్తి, అతని ఆత్మసంబంధమైన స్వభావము, అతని నైతిక స్పృహ, మరియు అతని భౌతిక కాయము (దేహం) అనే వాటిని గూర్చి ఆలోచించినట్లయితే, అతడు కేవలం సంభవించినవాడు కాదని, సర్వశక్తిగల దేవునిచేతనే సృజింపబడినవాడని నీవు తప్పక తీర్మానానికి వస్తావ్, దీనిని బట్టి దేవుడు నిజంగా ఉన్నాడని నీవు రూఢిగా నమ్మవచ్చు. మానవుని ఉనికి దేవుడున్నాడని రుజువు చేస్తుంది.

## ముగింపు

మనం ఆలోచించిన ఈ రెండు రుజువులను గూర్చి అంటే, లోకముయొక్క రుజువు మరియు మానవుని యొక్క రుజువును గూర్చి లోతుగా ఆలోచించు. అవి డిమాండ్ చేసే తీర్మానం ఎంత కాదనలేనిది, స్థిరమైనదంటే, "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" (కీర్తన. 14:1) అని బైబిలు అంటుంది.

మరియు మనలను నిర్మించిన దేవుడు ఒక రోజున మనలను తీర్పులోనికి పిలిచి, మనం ఎలా జీవించామో దాని లెక్క అడుగబోతాడని నమ్మడంకూడా న్యాయమైనదే. ఈ కారణాన్ని బట్టే ఆయన ప్రభువైన యేసును ఈ లోకానికి పంపారు, మరియు మనకు బైబిలును కూడా ప్రసాదించారు. మనం యిక్కడ ఎందుకున్నాం? మరియు మననుండి ఎదురుచూడబడింది ఏది? అనే వాటిని మనం తెలిసికోవాలని ఆయన కోరుతున్నాడు. ప్రభువైన యేసు యిలా అన్నారు, "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదిన మందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48).

ప్రభువైన యేసూ, బైబిలూ బయలుపరచే ఆశ్చర్యకరమైన సత్యమేమంటే, దేవుడు మనలను తనకు కుమారులనుగా స్వీకరింపగోరుతున్నాడు. సూర్యుని, చంద్రుని, నక్షత్రాలను, భూమిని, సర్వజగత్తును నిర్మించిన దేవుడే తన శాశ్వతమైన కుటుంబములో నా సహవాసాన్ని వెదకుతున్నాడు! తన కుమారుని యొక్క సువార్త ద్వారా తన కుటుంబములోనికి ఆయన నన్ను ఆహ్వానించాడు. ప్రభువైన యేసునందలి విశ్వాసం వలన నేను ఆ సువార్తకు లోబడగా, అంటే నా పాపముల విషయమై మారుమనస్సు పొంది, యేసును (ప్రభువుగా) ఒప్పుకొని, క్రీస్తు శరీరములోనికి నేను బాప్తిస్మముపొందగా, నేను ఆయన ఆత్మసంబంధమైన కుటుంబములోనికి స్వీకరింపబడ్డాను (ఎఫెసీ. 1:5;

గలతీ. 4:6). లేఖనాల ప్రకారం దేవుడున్నాడని మాత్రమే కాదు, నీవు నిజంగా ఆయన బిడ్డవు కాగలవని కూడా ఎరుగవచ్చు.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు - 245వ పేజీలో* )

1. ఎవడైన అడుగుగల మిక్కిలి సంపూర్ణమైన ప్రశ్న ఏది?
2. "దేవుడు ఉన్నాడా?" అనే ప్రశ్న ఎందుకు అంత సంపూర్ణమైనది?
3. బైబిలు దేనితో ఆరంభమౌతుంది?
4. దేవునియందు విశ్వసించేలా మనలను బలవంతపెట్టే తొలి రుజువేది?
5. మానవ ఉనికిని వివరించడంలో దేవుని విడిచిపెట్టువాడు ఎదుర్కొనే మూడు సమస్యలేవి?